సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.15 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.7 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.15
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.8 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3 వేల టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
33.7°/20.5°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

'పరిష్కార వేదిక'కు 232 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణ రెడ్డి

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి వివిధ సమస్యలపై ప్రజల నుంచి 232 అర్జీలు అందాయి. ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కారం కోసం వాటిని ఆయా శాఖలకు పంపారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవచ్చన్నారు. ప్రతి అర్జీపై పూర్తి స్థాయి విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. పెండింగ్, బియాండ్ ఎస్‌ఎల్‌ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీపీఓ సమతలతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు 1,156 ఈ పాస్ మిషన్లు

పుట్టపర్తి అర్బన్: చౌక ధాన్యం పంపిణీలో భాగంగా జిల్లాకు 1,156 ఈ పాస్ మిషన్లు చేరాయని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణా రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వెల్లడించారు. గతంలో పంపిణీ చేసిన ఈ పాస్ మిషన్లు తరచూ సాంకేతిక సమస్యలతో మొరాయిస్తుండడంతో నూతన మిషన్లను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.

వృద్ధుడిని ఏమార్చి నగదు అపహరణ

గోరంట్ల: వృద్ధుడిని ఏమార్చి అతని ఏటీఎం కార్డు ద్వారా నగదు అపహరించిన ఘటన గోరంట్లలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు... పుట్టపర్తి మండలం పెడపల్లి తండాకు వృద్ధుడు గ్యాంగేనాయక్ సోమవారం రూ.10వేలు నగదు విత్ డ్రా చేసేందుకు గోరంట్లలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రానికి చేరుకున్నాడు. అయితే నగదు విత్ డ్రా విధానం తెలియక అక్కడే ఉన్న ఓ యువకుడి సాయం తీసుకున్నాడు. అతను ఏటీఎం నుంచి రూ.5వేలు డ్రా చేసి, అంతే మొత్తం మాత్రమే వస్తుందని నమ్మబలుకుతూ వృద్ధుడిని ఏమార్చి మరో ఏటీఎం కార్డు చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత ఏటీఎం ద్వారా రూ.35 వేలు డ్రా అయినట్లుగా ఫోన్‌కు మెసేజ్ అందడంతో వృద్ధుడి కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. చేతిలో ఉన్న ఏటీఎం కార్డును పరిశీలించగా అది తమది కాకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

"నీ ఊరికి మెడికల్ కాలేజీ వస్తే దగ్గరుండి కట్టించాల్సింది పోయి నిస్సహాయంగా నిలబడ్డావా..?"

"మంత్రి పదవి జగన్‌ను తిట్టడానికి ఇచ్చారా, లేకుంటే అభివృద్ధి చేయడానికా..?"

"అనంతపురంలో సర్వజనాసుపత్రి పరిస్థితి ఒక్కసారి చూడు నీకే అర్థమవుతుంది నీ ప్రభుత్వ పరిస్థితి ఏమిటో.."

ఇవేవో.. అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై ప్రతిపక్ష నాయకులు చేసిన విమర్శలు అనుకుంటే పొరబడినట్లే. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన మెడికల్ కళాశాలలపై కూటమి మంత్రులు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల వేదికగా నెటిజన్లు విసిరిన విమర్శనాస్త్రాలివీ.



గత ప్రభుత్వ హయాంలో జరిగిన పెనుకొండ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను తెలియజేస్తూ సెల్ఫీ తీసుకుంటున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ (ఫైల్)

అబద్ధాలపై ఆగ్రహావేశాలు



కారుకూతలపై కౌంటర్ల వర్షం

- మంత్రులకు జనం ఝలక్
- సవిత, సత్యకుమార్‌పై సోషల్ మీడియాలో విమర్శల వెల్లువ
- సవిత సొంత నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ వస్తే కట్టించుకోలేని దుస్థితి
- ఆరోగ్యశాఖా మంత్రిపైనా నెటిజన్ల నిప్పులు
- స్విమ్మింగ్ పూల్ వ్యాఖ్యలకు అమరావతి వరద ఫొటోలతో కౌంటర్
- ఎంసీహెచ్ బ్లాక్, సర్జరీ బ్లాక్ వరకూ గత ప్రభుత్వ హయాంలో వచ్చినవే
- మంత్రి సవిత వ్యాఖ్యలకు మాజీ మంత్రి ఉషశ్రీ వ్యాఖ్యలతో కౌంటర్ ట్యాగ్‌లైన్‌లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అవగాహన రాహిత్యంతో వ్యాఖ్యలు చేస్తూ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు పరువు పోగొట్టుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీలన్నీ పీపీపీ విధానంలో నిర్వహిస్తామంటూ ఇటీవల అనంతపురం సభలో సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు మంత్రుల మెడకు చుట్టుకున్నాయి. బాబు తానా అంటే మంత్రులు తందానా అంటున్న వైనంపై సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు నిప్పులు చెరుగుతున్నారు. గత నాలుగు రోజులుగా మంత్రులపై నెటిజన్లు చేస్తున్న ట్రోలింగ్ అంతా ఇంతా కాదు. ప్రభుత్వం అందించాల్సిన వైద్య సేవలను ప్రైవేటుకు అప్పజెబుతుంటే 'అసలు మీరు మంత్రులేనా' అంటూ ఫైర్ అవుతున్నారు.

సొంతూరికి మెడికల్ కాలేజీ వస్తే..

గత ప్రభుత్వ హయాంలో పెనుకొండకు మెడికల్ కాలేజీ మంజూరు చేయడమే కాదు, దాదాపు మూడు అంతస్తుల నిర్మాణమూ జరిగింది. 50 ఎకరాల్లో రూ.375 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు పనులు కూటమి ప్రభుత్వం రాగానే ఆగిపోయాయి. కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయాల్సిన పెనుకొండ శాసనసభ్యురాలు, స్వయానా మంత్రి అయిన సవిత.. కాలేజీ నిర్మాణం సందర్శనకు వెళ్లి వెటకారంగా చేసిన వ్యాఖ్యలపై సోషియల్ మీడియా యాక్టివిస్టులు భగ్గుమంటున్నారు. సొంత ప్రాంతానికి మెడికల్ కాలేజీ వస్తే దగ్గరుండి కట్టించాల్సింది పోయి అన్యాయంగా మాట్లాడతారా అంటూ దుయ్యబడుతున్నారు. మంత్రి పదవి జగన్‌ను తిట్టడానికి ఇచ్చారనుకుంటున్నారా అంటూ నిలదీస్తున్నారు. ఇదే క్రమంలో సవిత వ్యాఖ్యలకు కౌంటర్‌గా 'ఇక్కడి నుంచి దూకు.. నిర్మాణం ఎంత పూర్తయిందో తెలుస్తుంది' అంటూ రెండు రోజుల క్రితం మాజీ మంత్రి ఉషశ్రీ చేసిన వ్యాఖ్యలను జోడించడం గమనార్హం.

'అసలు నీకు ఆరోగ్యమంటే తెలుసా..'

మంత్రి సత్యకుమార్‌పైనా నెటి'జనం' నుంచి విమర్శల వర్షం కురుస్తోంది. ధర్మవరానికి వలస పక్షిలా వచ్చిన ఆయనకు ఆరోగ్యశాఖ గురించి ఏం తెలుసు అంటూ సెటైర్లు వేస్తున్నారు. ప్రభుత్వమే కాలేజీలు కడితే మరో 20 ఏళ్లు పడుతుందని జగన్‌కు సత్యకుమార్ లేఖ రాయడంపైనా ఘాటు విమర్శలు చేస్తున్నారు. 'అసలు నీకు ఆరోగ్యమంటే తెలుసా.. ఐదు కాలేజీలు ప్రారంభమయ్యాయి కదా' అంటూ మండిపడుతున్నారు. 'అనంతపురంలో సర్వజనాసుపత్రి పరిస్థితి ఒక్కసారి చూడు.. నీకే అర్థమవుతుంది నీ ప్రభుత్వ పరిస్థితి ఏమిటో' అంటూ కొంతమంది జీజీహెచ్ ఫొటోలు ఆయన లేఖకు జత చేసి ఫేస్‌బుక్‌లో పెట్టారు.



మంత్రి సవిత



మంత్రి సత్యకుమార్

ముందుగా అది చూడమ్మా..

మంత్రి సవిత పెనుకొండ కాలేజీపై చేసిన 'స్విమ్మింగ్‌పూల్' వ్యాఖ్యలపై నెటిజన్లు పేల్చిన సెటైర్‌లు వైరల్ అవుతున్నాయి. రూ. వేల కోట్లు ఖర్చు చేసి అమరావతిలో రాజధాని కడుతున్నారు. ఆ ప్రాంతం నుంచి వరద నీళ్లు బయటకు తోడేందుకు కూడా రూ. కోట్లు ఖర్చు చేస్తున్నారు. ముందుగా అది చూడమ్మా సవితమ్మా.. అంటూ కౌంటర్ల మీద కౌంటర్లు వేస్తున్నారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

గత ప్రభుత్వ హయాంలో మంజూరైనవి ఇలా	
పెనుకొండ మెడికల్ కాలేజీ	50 ఎకరాల్లో
ప్రాజెక్టు అంచనా	రూ.375 కోట్లు
ఇప్పటివరకూ చేసిన వ్యయం	రూ.30 కోట్లు
అనంతపురంలో సర్జికల్ బ్లాక్	రూ.68 కోట్లు
ఎంసీహెచ్ బ్లాక్	రూ.72 కోట్లు
మెన్స్, ఉమెన్స్ పీజీ హాస్టల్	రూ.22 కోట్లు
50 పడకల క్రిటికల్ కేర్	రూ.23.75 కోట్లు
50 ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు	రూ.60 కోట్లు

డీఎస్సీ ఎంపిక జాబితా విడుదల

- జిల్లాలో 811 పోస్టులకు గాను 755 పోస్టుల భర్తీ
- వివిధ కేటగిరీల్లో 55 పోస్టులకు అభ్యర్థులు లేరు
- ఎంపికైన అభ్యర్థులకు 19న అమరావతిలో సమావేశం

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–25 తుది ఎంపిక జాబితా సోమవారం విడుదల చేశారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. జిల్లాలో మొత్తం 811 పోస్టులకు గాను 755 పోస్టులు భర్తీ చేస్తున్నారు. తక్కిన 56 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేరని అధికారులు ప్రకటించారు. జూన్ 6 నుంచి జూలై 2 వరకు సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహించారు. గతనెలలో తుది కీ విడుదల చేశారు. ఆ తర్వాత నార్మలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి టెట్ స్కోరును డీఎస్సీ స్కోరుకు వెయిటేజీ ఇచ్చి మెరిట్ జాబితాలు రూపొందించారు. ఆ తర్వాత మెరిట్ జాబితా ప్రకటించారు. ఆ తర్వాత చేపట్టిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ అభ్యర్థులను కాస్తా గందరగోళానికి గురి చేసింది. ఎట్టకేలకు పలు దశల్లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి తుది జాబితాను విడుదల చేశారు. జిల్లాకు వచ్చేసరికి స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో 629 పోస్టులు, మునిసిపల్ స్కూళ్లల్లో 64 పోస్టులు, మునిసిపల్ కార్పొరేషన్ స్కూళ్లల్లో 58 పోస్టులు, ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లల్లో 4 పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఎంపికైన అభ్యర్థులతో 19న అమరావతిలో సీఎం చంద్రబాబు సమావేశం ఏర్పాటు చేయనున్నారు. అదేరోజు కొందరికి నియామక పత్రాలు అందజేయనున్నారు. రాయలసీమ జిల్లాల పరిధిలోని కొత్త టీచర్లందరికీ 21 నుంచి వారం రోజుల పాటు తిరుపతిలో శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లాలో కేటగిరీల వారీగా భర్తీ చేస్తున్న పోస్టులు..

స్కూల్ అసిస్టెంట్ బీఎస్ (తెలుగు) 71 పోస్టులు, ఎస్‌ఏ ఇంగ్లీష్ 101 పోస్టులు, ఎస్‌ఏ హిందీ 26 పోస్టులు, ఎస్‌ఏ గణితం (తెలుగు) 41, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ 142, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ (తెలుగు) 65, ఎస్‌ఏ సోషల్ (తెలుగు) 109, ఎస్‌ఏ తెలుగు 27, ఎస్‌ఏ ఉర్దూ 05, ఎస్జీటీ కన్నడ 05, ఎస్జీటీ తెలుగు 148, ఎస్జీటీ ఉర్దూ 14, స్కూల్ అసిస్టెంట్ సోషల్ (ఉర్దూ) ఒక పోస్టు.

'కూటమి' చెరలో చిత్రావతి!

- నది నుంచి భారీగా ఇసుక అక్రమ రవాణా
- ప్రైవేటు స్థలంలో డంప్.. బెంగళూరుకు తరలింపు
- ఇసుకాసురులకు మాజీ మంత్రి 'పల్లె' అండ !

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరినప్పటి నుంచీ ఆ పార్టీల నేతలు సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో సులువుగా డబ్బు సంపాదించేందుకు సహజ వనరులను కొల్లగొడుతున్నారు. ఇందుకోసం చిత్రావతిని చెరబట్టి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇరిగేషన్, మైనింగ్ అధికారులను భయపెట్టి జేసీబీల సాయంతో పట్టపగలే ఇసుకను తరలిస్తున్నారు. కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జి దగ్గర నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న చిత్రావతి నది నుంచి ఇసుకను తోడేస్తూ తరలిస్తున్నారు. కూటమి నేతల ధనదాహానికి చిత్రావతి రూపురేఖలే మారిపోయాయి. ఎక్కడ చూసినా పెద్దపెద్ద గుంతలు కనిపిస్తున్నాయి. రేయింబవళ్లు వందల ట్రాక్టర్ల ఇసుకను చిత్రావతి నుంచి తరలించి ఓ చోట డంప్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో బెంగళూరుకు పంపి భారీగా సంపాదిస్తున్నారు. కూటమి నేతల ఇసుక దందాను ఇరిగేషన్ అధికారులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా... మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి వారిని మందలించినట్లు తెలుస్తోంది. చిత్రావతివైపు గానీ, ఇసుక అక్రమ రవాణా వైపు గానీ కన్నెత్తి చూడవద్దని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో ఇరిగేషన్ అధికారులు మైన్స్ శాఖ అధికారులకు లేఖలు రాసి మిన్నకుండిపోయారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ చిత్రావతిలో చెక్ డ్యాం నిర్మాణం పేరుతో కేవలం ఇసుకను తరలించి రూ.వందల కోట్లు సంపాదించినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా కూడా డబ్బు కోసం అదే మార్గాన్ని అవలంబిస్తున్నారు.



చిత్రావతి నది నుంచి జేసీబీతో ఇసుకను ట్రాక్టర్‌కు లోడింగ్ చేస్తున్న దృశ్యం



ప్రశాంతి నిలయం వెస్ట్ గేట్ సమీపంలో ప్రైవేటు స్థలంలో డంప్ చేసిన ఇసుక

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



అంతర్రాష్ట్ర దొంగల ముఠానుంచి స్వాధీనం చేసుకున్న నగదు, కారును చూపుతున్న పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప, సీఐ శేఖర్

- రూ.11.30 లక్షల నగదు స్వాధీనం, కారు సీజ్

గోరంట్ల: బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి తీసుకువెళ్లే వారిని టార్గెట్ చేసి దోచుకునే ఆరుగురు సభ్యులు గల అంతర్రాష్ట్ర ముఠాను గోరంట్ల పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.11.30 లక్షల నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు చోరీలకు ఉపయోగించిన కారును సీజ్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం గోరంట్ల పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నర్సింగప్ప, గోరంట్ల సీఐ శేఖర్ వెల్లడించారు.

ఆరుగురు నిందితులు... నాలుగు రాష్ట్రాల్లో చోరీలు

గోరంట్ల మండలం కొండాపురం గ్రామానికి చెందిన రైతు భుజంగరావు ఈనెల 3వ తేదీన స్థానిక స్టేట్‌బ్యాంక్‌లో రూ.3.80 లక్షలు డ్రా చేసుకొని ద్విచక్రవాహనంలోని సైడ్‌బ్యాగులో పెట్టుకొని ఇంటికి వెళ్లే క్రమంలో గోరంట్లలోని ఓ వస్త్ర దుకాణం వద్ద ఆగాడు. దుకాణంలోకి వెళ్లి తిరిగి వచ్చి చూసుకునే సరికి ద్విచక్రవాహనం సైడు బ్యాగులో ఉంచిన నగదు కనిపించలేదు. దీంతో రైతు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. గోరంట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 14వ తేదీ (ఆదివారం) సాయంత్రం పాలసముద్రం సమీపంలోని 'కియో' హోటల్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌ఘడ్‌లోని కడియాశాంతి గ్రామానికి చెందిన దీపభాయితోపాటు పరిత సిసోడియా, ప్రదీప్ సిసోడియా, రేఖాబాయి, మమత, మాలభాయిలను అదుపులోనికి తీసుకుని ప్రశ్నించారు. విచారణలో రైతు భుజంగరావుకు చెందిన రూ.3.80 లక్షల నగదును తామే చోరీ చేసినట్లు వారు ఒప్పుకున్నారు. అంతేకాకుండా ఆగస్టు 27వ తేదీ నుంచి రాష్ట్రంలోని పులివెందుల, జమ్మలమడుగు, కర్ణాటక రాష్ట్రంలోని మధుగిరి, తెలంగాణ రాష్ట్రంలోని గజ్వేల్, జనగామ, ఒడిశా రాష్ట్రంలోని బరంపూర్‌లో చోరీలు చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు రైతు భుజంగరావు వద్ద చోరీ చేసిన రూ.3.80 లక్షలతో పాటు వివిధ కేసులకు సంబంధించి రూ.7.50 లక్షలు మొత్తంగా రూ.11.30 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చోరీలకు ఉపయోగించిన కారును సైతం సీజ్ చేశారు. సోమవారం నిందితులను పెనుకొండ కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. చోరీ కేసులను చాకచక్యంగా ఛేదించిన సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రతో పాటు సిబ్బందిని డీఎస్పీ నరసింగప్ప ప్రత్యేకంగా అభినందించారు.

పూలు.. కన్నీళ్లు



- పరిమళించని ధర..పస్తుల్లో రైతన్న
- అమాంతం పడిపోయిన పూల ధరలు
- కేజీ బంతిపూలు రూ.5, కనకాంబరాలు కేజీ రూ.50 లోపే
- రవాణా చార్జీలు కూడా దక్కక తోటల్లోనే వదిలేస్తున్న వైనం

పూలు పరిమళించినా.. ధర దిగాలు పెడుతోంది. వికసించాల్సిన రైతు మోము.. మొగ్గలా ముడుచుపోతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పూలు మార్కెట్‌కు తరలించగా.. రవాణా చార్జీలు కూడా రాని పరిస్థితి నెలకొంది. దీంతో చాలా మంది రైతులు రోడ్డున వెళ్లే వారికి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. మరికొందరు మాత్రం తోటల్లోనే వదిలేస్తున్నారు.

పుట్టపర్తి అర్బన్: పూల ధరలు అమాంతం పడిపోయాయి. నెలరోజుల క్రితం రూ.1,500 పలికిన కేజీ కనకాంబరాలు నేడు రూ.50కి కూడా కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఫలితం రూ.లక్షలు ఖర్చు చేసి పూలు సాగుచేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రవాణా చార్జీలు కూడా రాని పరిస్థితుల్లో చాలా మంది పూలను తోటల్లోనే వదిలేస్తున్నారు. ప్రస్తుతం బంతి పూలు తోటల నుంచి సేకరించి హైదరాబాద్, బెంగళూరు నగరాలకు తరలిస్తే కిలోకు రూ.8 మేర దక్కుతోంది. ఇక కనకాంబరాలను కొనుగోలు చేసేవారే లేకపోవడంతో మార్కెట్‌కు పూలు తెచ్చిన రైతులు ఉచితంగా పంచేసి పోతున్నారు. పెట్టుబడి కూడా దక్కని పరిస్థితుల్లో నష్టాల ఊబిలో చిక్కుకుపోయారు.

జిల్లాలో 619 హెక్టార్లలో పూల సాగు..

జిల్లా వ్యాప్తంగా సుమారు 619 హెక్టార్లలో రైతులు పూల సాగు చేశారు. అగళి, రొళ్ల, మడకశిర, బత్తలపల్లి, పుట్టపర్తి, నల్లచెరువు, గుడిబండ తదితర మండలాల రైతులు బంతి, చేమంతి, కనకాంబరం, రోజా, మల్లె తదితర రకాల పూలను సాగు చేస్తున్నారు. వీరంతా పూలను బెంగళూరు మార్కెట్‌కు తరలిస్తుంటారు. ఇటీవల జరిగిన వరలక్ష్మీ వ్రతం, వినాయక చవితి ఉత్సవాల్లో కిలో బంతి పూలు రూ.100, కనకాంబరాలు రూ.1,500, చేమంతి రూ.500, రోజాలు రూ.1000 వరకూ ధర పలికాయి. కానీ కొన్ని రోజుల్లోనే పూల ధరలు అమాంతం పడిపోయాయి. ప్రస్తుతం కిలో బంతి పూలు రూ.8, కనకాంబరాలు రూ.50, చేమంతులు రూ.30 చొప్పున వ్యాపారులు కొంటున్నారు. దీంతో రైతులకు కూలి ఖర్చులు, రవాణా ఖర్చులు కూడా రాని పరిస్థితుల్లో పూలను తోటల్లోనే వదిలేశారు.

భారీగా పెట్టుబడి..

పూల తోటలు సాగు చేయడానికి భారీగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఒక్కో పూల మొక్క రూ.2 నుంచి రూ.5 వరకూ నర్సరీల నుంచి కొనాల్సి ఉంటుంది. ఎకరాకు 24 వేల నుంచి 30 వేల మొక్కలు అవసరం అవుతాయి. ఇలా కొనుగోలు చేసిన మొక్కలను పొలానికి తీసుకురావడం, బోదులు తోలడం, నాటించడం, గడ్డి తొలగించడం, కట్టు కట్టడం, మందుల పిచికారీ, పూలు కోయడం, మార్కెట్‌కు తరలించడం.. ఇలా అన్నీ కూలీలతో చేసే పని కావడంతో ఖర్చులు అధికంగా వస్తాయని రైతులు చెబుతున్నారు. ఎంతలేదన్నా ఎకరాకు రూ.లక్ష దాకా పెట్టుబడి పెట్టాల్సి వస్తుందంటున్నారు. తీరా మార్కెట్‌లో ధర లేకపోతే పూలు కన్నీళ్లు మిగులుస్తాయంటున్నారు.



మార్కెట్‌కు తరలించేందుకు గోరంట్ల వద్ద సిద్ధంగా ఉన్న బంతిపూలు



కనకాంబర పూలు ఉచితంగా పంపిణీ చేస్తున్న బత్తలపల్లి రైతులు

నష్టాలు వచ్చాయి

పండుగలు, శుభకార్యాలు లేకపోవడంతో పూలకు గిరాకీ లేదు. ఇటీవల వరలక్ష్మీవ్రతం, వినాయక చవితికి పూలకు మంచి గిరాకీ ఉన్నా... ఆ తర్వాత పూలను అడిగేవారే లేరు. రవాణా చార్జీలు కూడా రాని పరిస్థితిలో పూలను తోటలోనే వదిలేశాను. దీంతో వేలాది రూపాయల నష్టం వచ్చింది. దసరా పండుగ వచ్చే వరకూ ధరలు ఉండవు. ఇక పూల తోటలను తొలగించుకోవాల్సిందే.

– నారాయణస్వామి, గోరంట్ల

ఉచితంగా పంచాం

నేను పదేళ్లుగా పూల తోటలు సాగు చేస్తున్నాను. ఈసారి కనకాంబరాలు వేశా. గతంలో ఎన్నడూ లేనంతగా ధర పడిపోయింది. కిలో పూలు రూ. 50 పలుకుతున్నాయి. కానీ వ్యాపారులకు జల్లకు రూ.200 కమీషన్ చెల్లించాల్సి వస్తోంది. ఆ డబ్బుకూడా వచ్చే పరిస్థితి లేక ఇటీవల బత్తలపల్లి మార్కెట్‌కు తీసుకుపోయిన కనకాంబరాలను దారిన పోయే వారికి ఉచితంగా పంచాను.

– కొండయ్య, బత్తలపల్లి

తోటలోనే వదిలేశా

నేను 4 ఎకరాల్లో బంతి పూలు సాగు చేశా. మార్కెట్‌లో ధర లేదు. బంతి పూలు కిలో రూ.5 కూడా అడగడం లేదు. అందుకే పూలను తోటలోనే వదిలేశా. మూడు నెలల్లో నాలుగు కోతలు మాత్రమే కోశా. సాగు చేసిన ఖర్చులు కూడా రాలేదు. దసరా పండుగ సమయంలో పూలకు గిరాకీ ఉంటుందని అనుకుంటున్నా. అందుకే అంతవరకూ తోటను కాపాడుతా.

– రవి, పెడపల్లి

క్లుప్తంగా

నేత్రపర్వంగా శ్రీవారి ఉట్లోత్సవం


ఉట్ల మాను ఎక్కుతున్న యువకులు

కదిరి టౌన్: భాద్రపద బహుళ అష్టమిని పురస్కరించుకుని ఖాద్రీ ఆలయ తూర్పు రాజగోపురం ఎదుట సోమవారం రాత్రి శ్రీవారి ఉట్లోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కాలేపల్లికి చెందిన గొల్ల సామాజిక వర్గానికి చెందిన యువకులు ఉట్ల మాను ఎక్కడానికి పోటీ పడ్డారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరు వీధుల్లో ఊరేగించారు.

సామూహిక సెలవులకు అనుమతివ్వండి

- ఎంపీడీఓకు పంచాయతీ కార్యదర్శుల వినతి


ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఎన్పీకుంట: సమస్యలు పరిష్కరించలేకపోతే సామూహిక సెలవులు మంజూరు చేయాలంటూ ఎంపీడీఓ పార్థసారథికి పంచాయతీ కార్యదర్శులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓను కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఏ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు లేని విధంగా తమపై పనిభారం పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించడం, సెలవులు, పండుగలు, ఆదివారాల్లోనూ బలవంతంగా పనిచేయించడం దారుణమన్నారు. పనిభారంతో శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. స్వామిత్వ సర్వేలో సభ్యులందరూ హాజరు కాక పోవడంతో సర్వే ఆలస్యమవుతోందని, అయితే ఉన్నతాధికారులు మాత్రం సర్వే త్వరితగతిన పూర్తి చేయాలంటూ ఒత్తిళ్లు పెంచుతున్నారని మండిపడ్డారు. అంతేకాక సచివాలయంలో రకరకాల సర్వేలు, ఆడిట్‌లు, ఇతర అంశాలపై ఒక పంచాయతీ కార్యదర్శి ఏకాగ్రత చూపలేక పోతున్నారన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్ చాలా క్లిష్టమైన పనిగా ఉందన్నారు. సమస్యలకు పరిష్కారం చూపాలని, అలా చేయడానికి అవకాశం లేకపోతే తమకు సామూహిక సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ కరువైంది. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న పత్రికలపై, పత్రికా విలేకరులపై ఈ మధ్యకాలంలో కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోంది. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పత్రిక ద్వారా ప్రభుత్వానికి, అధికారులకు తెలియజేస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగంలో ఉన్న వాక్ స్వాతంత్ర్యాన్ని కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. దీనిని ఎస్ఎఫ్ఐ అనంతపురం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి.

– ఓతూరు పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



వాస్తవాలు రాస్తున్నారనే 'సాక్షి'పై అక్రమ కేసులు



తెలుగు ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్న 'సాక్షి' పత్రికపై కూటమి ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతోంది. ప్రతిపక్ష నేతలను, ప్రజల పక్షాన మాట్లాడే 'సాక్షి'ని నోరు మూయించాలనే ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు పాలనలో చేసిందేమీ లేకపోయినా ఏదో అద్భుతాలు జరుగుతున్నట్లు ఎల్లో మీడియాలో చూపిస్తున్నారు. కానీ 'సాక్షి'లో వాస్తవాలు రాస్తున్నందున చంద్రబాబు బండారం ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిసిపోతోంది. అందుకే 'సాక్షి' పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తన తప్పులను సరిచేసుకోకుండా కక్ష సాధింపు చర్యలకు దిగడం సిగ్గుచేటు. అక్రమ కేసులు, అరెస్టులు 'సాక్షి'ని ఏమీ చేయలేవు.

– మహమ్మద్ షాకీర్, మాజీ మంత్రి, కదిరి

పట్టు తప్పిన ప్రోత్సాహకం



- బైవోల్టిన్ పట్టు రైతులకు అందని రాయితీ సొమ్ము
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేరుకుపోయిన రూ.27 కోట్ల బకాయిలు
- రీలర్లకూ అందని ప్రోత్సాహక ధనం


హిందూపురంలోని పట్టు గూళ్ల మార్కెట్‌లో జరుగుతున్న క్రయవిక్రయాలు

మడకశిర: ఏడాది కాలంగా పట్టుగూళ్లు ఉత్పత్తి చేస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు లేవు. పట్టు పురుగులు పెంచే షెడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో అందించే రాయితీ సొమ్మూ రైతులకు చెల్లించడం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో బైవోల్టిన్ పట్టు రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. దీంతో బైవోల్టిన్ పట్టు సాగుపై రైతుల్లో ఆసక్తి సన్నగిల్లుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో బైవోల్టిన్ పట్టుగూళ్ళ ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. కిలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర రూ.700కు పైగా పలుకుతోంది. ప్రోత్సాహక ధనం అందకపోవడంతో బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. హిందూపురం మార్కెట్‌కు రోజూ బైవోల్టిన్ పట్టుగూళ్లు దాదాపు 40 నుంచి 50 లాట్లు వచ్చేవి. ప్రస్తుతం రోజూ 30 లాట్‌ల లోపే ఉంటున్నాయి.

పేరుకుపోయిన రూ.66 కోట్ల బకాయి

ఉమ్మడి జిల్లాలో పట్టు రైతులు రెండు రకాల పట్టు గూళ్లను ఉత్పత్తి చేస్తున్నారు. పట్టు సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆకర్షణీయమైన ప్రోత్సహకాలు ఇస్తోంది. బైవోల్టిన్ పట్టు గూళ్లను ఉత్పత్తి చేసి ప్రభుత్వ మార్కెట్‌లో విక్రయించిన రైతుకు కిలోకు రూ.50, అలాగే సీబీ రకం పట్టు గూళ్లకు కిలోకు రూ.10 చొప్పున ప్రోత్సాహక ధనాన్ని ప్రభుత్వం అందజేస్తూ వచ్చింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టు రైతులు నయా పైసా ప్రోత్సాహక ధనం అందలేదు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పట్టు రైతులకు రూ.66 కోట్ల బకాయిలు పేరుకుపోగా ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే రూ.27 కోట్ల బకాయిలు ఉండడం గమనార్హం. అలాగే పట్టుగూళ్ల నుంచి దారం వెలికి తీసే రీలర్లకూ ప్రతి కిలో దారానికి రూ.130 చొప్పున ప్రోత్సాహక ధనం చెల్లించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 17 నెలల కాలంలో నయా పైసా ప్రోత్సాహక ధనం అందలేదని రీలర్లూ వాపోతున్నారు.

పట్టు రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక ధనం ఇలా...

బైవోల్టిన్ పట్టు రైతులకు :	కిలోకు రూ. 50
సీబీ పట్టు రైతులకు :	కిలోకు రూ. 10
రీలర్లకు అందించేది :	కిలో దారానికి రూ. 130

పట్టించుకోని ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం పట్టు రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. ప్రోత్సాహక ధనం కోసం అనేక రకాలుగా పోరాటం చేసినా కనికరం చూపడం లేదు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు కూడా బైవోల్టిన్ పట్టు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. పట్టు రైతులకు ప్రోత్సాహక ధనం మంజూరు చేయకపోతే ఆందోళనకు దిగడం ఖాయం.

– ఆనంద రంగారెడ్డి, పట్టు రైతు సంఘం నాయకుడు, మడకశిర

బకాయిలు వెంటనే విడుదల చేయాలి



పట్టు రైతులను ఆదుకోవాలంటూ పట్టు రైతు సంఘం ఆధ్వర్యంలో పలుమార్లు విజయవాడకు వెళ్లి ప్రభుత్వ పెద్దలతో చర్చించాం. అయినా కూటమి సర్కారులో మార్పు రాలేదు. పట్టు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి. పేరుకుపోయిన ప్రోత్సాహక ధనం బకాయిలు తక్షణమే విడుదల చేయాలి.

– వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర పట్టు రైతు సంఘం అధ్యక్షుడు

తప్పని ఆర్థిక ఇబ్బందులు



ప్రభుత్వం ప్రోత్సాహక ధనం బకాయిలను మంజూరు చేయకుండా జాప్యం చేస్తోంది. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాం. పరిస్థితి ఇలాగే ఉంటే పట్టుగూళ్ల ఉత్పత్తికి రైతులు స్వస్తి పలుకుతారు.

– సోమ్‌కుమార్, పట్టు రైతు సంఘం అధ్యక్షుడు, మడకశిర

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సిగ్గుచేటు

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి


మాట్లాడుతున్న నరసింహమూర్తి

పుట్టపర్తి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే, వాటిని నిర్వహించే సత్తా లేక కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం సిగ్గు చేటని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాతంగి తిప్పన్న విమర్శించారు. గత ప్రభుత్వం సాధించిన రికార్డు కళ్లకు కనిపించడం లేదా అని మంత్రి సవితను ప్రశ్నించారు. ఎస్సీ సెల్ వివిధ అనుబంధ విభాగం అధ్యక్షులు, సభ్యుల విస్తృత స్థాయి సమావేశం పుట్టపర్తిలోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం జరిగింది. సమావేశంలో నరసింహమూర్తి, మాతంగి తిప్పన్న మాట్లాడుతూ.. పెనుకొండతో పాటు రాష్ట్రంలోని పులివెందుల తదితర ప్రాంతాలలో నిర్మాణాలను 80 శాతానికి పైగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. అయితే పెనుకొండలో వైద్య కళాశాల నిర్మాణమే జరుగలేదని మంత్రి పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. వైద్య కళాశాల నిర్వహణ చేతకాక ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. రాష్ట్రంలో ఎస్సీలపై దౌర్జన్యాలు పెచ్చుమీరాయని, ఎస్సీ మహిళలపై అత్యాచారాలు మితిమీరిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వంలోనే ఎస్సీలు అన్ని రంగాల్లోనూ రాణించారన్నారు. కార్యక్రమంలో పార్టీ అనుబంధ సంఘాల నేతలు ఓబులేసు, ఫొటో సాయి, చౌడప్ప, రామాంజనేయులు, ఆంజనేయులు, నరసింహులు, నారాయణస్వామి, రామయ్య, నరేష్, గంగన్న, చిన్నరెడ్డన్న, బి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌ఎంఎంఎస్'కు వేళాయె

- పేద విద్యార్థులకు వరం
- అర్హత సాధిస్తే 9 నుంచి ఇంటర్ వరకూ ఏటా రూ.12 వేల స్కాలర్‌షిప్
- ఈ నెల 30 వరకూ దరఖాస్తుల స్వీకరణ

కదిరి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్) పేరుతో ఉపకార వేతనాలు అందిస్తోంది. ప్రస్తుత విద్యాసంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దేశ వ్యాప్తంగా ఏటా 1 లక్ష మంది విద్యార్థులకు ఈ ఉపకార వేతనం అందుతోంది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏటా 4,087 మంది విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికవుతున్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సంఖ్యను బట్టి ఏ జిల్లాకు ఎంతమంది అర్హులో తర్వాత నిర్ణయిస్తారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా అందజేయాలి. డిసెంబర్ 7న రాత పరీక్ష ఉంటుంది. ఇందులో అర్హత సాధిస్తే నెలకు రూ.వెయ్యి చొప్పున 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకూ ఏడాదికి రూ.12వేలు చొప్పున రూ.48వేల స్కాలర్‌షిప్ అందజేస్తారు.

దరఖాస్తు విధానం

రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తులను ఆయా పాఠశాలలు సమర్పించాలి. అనంతరం ఆ దరఖాస్తుల ప్రింట్ అవుట్‌లను, ధ్రువీకరణ పత్రాలను డీఈఓకు పంపాలి. ప్రతి విద్యార్థికి పరీక్ష ఫీజు రూ.100. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుంది. ఇది ఎస్‌బీఐ చలానా రూపంలో జత చేయాలి. అక్టోబర్ 10వ తేదీలోపు ఫీజు చెల్లించాలి.

అర్హులు వీరే..

- ప్రభుత్వ, మున్సిపల్, జెడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో ఈ విద్యాసంవత్సరం 8వ తరగతి చదువుతుండాలి.
- గత ఏడాది (2024–25)లో 7వ తరగతిలో ఓసీ, బీసీ విద్యార్థులు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలకు మించరాదు.
- అర్హత పరీక్షలో ఓసీ, బీసీ, పీహెచ్ విద్యార్థులకు 40 శాతం అంటే 36 మార్కులు రావాలి.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం(29 మార్కులు) రావాలి.

సద్వినియోగం చేసుకోండి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎన్ఎంఎంఎస్ పథకం ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగం. ఉన్నత చదువులు చదవాలనే ఆశయంతో ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలు దరఖాస్తు ప్రక్రియలో విద్యార్థులకు తగిన సహకారం అందించాలి.

– మల్లాది లాజరు, ఎన్ఎంఎంఎస్ నోడల్ ఆఫీసర్

పరిష్కార వేదికకు 60 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్



ఎస్పీకి అందజేసిన వినతిని చూపుతున్న బాధితులు మంజుల, వరలక్ష్మి

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 60 వినతులు అందాయి. ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ పాల్గొన్నారు.

పోలీసులే అన్యాయం చేస్తున్నారు

టీడీపీ నేతల మాటలు విని కేసు నమోదు చేయకుండా పోలీసులే తమకు అన్యాయం చేస్తున్నారంటూ ఎస్పీ ఎదుట నల్లమాడ మండలం సానేవారిపల్లి గ్రామానికి చెందిన మంజుల, వరలక్ష్మి వాపోయారు. ఈ మేరకు సోమవారం వారు ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... సానేవారిపల్లికి గ్రామంలో గత నెల 30న గణేష్ నిమజ్జనము జరిగిందని, ఆ సమయంలో ఆంజనేయులు, మంజుల, వరలక్ష్మి కుటుంబాల మధ్య చిన్నపాటి గొడవలు చోటు చేసుకోవడంతో ట్రాక్టర్‌లో ఉన్న చెన్నకేశవులపై ఆంనేయులు, ఆయన కుమారులు రాజేష్, సాయితో పాటు వారి బంధువులు దాడి చేశారన్నారు. అంతటితో ఆగకుండా సాయంత్రం వరలక్ష్మి, మంజుల ఇంటిపై కొడవళ్లు, రాళ్లతో దాడి చేశారని వివరించారు. దాడికి పాల్పడిన వారు టీడీపీ నేతలు కావడంతో ఘటనపై కేసు నమోదు చేసేందుకు నల్లమాడ పోలీసులు వెనకడుగు వేస్తున్నారన్నారు. పైగా టీడీపీ నేతల ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని అక్రమంగా తమపై కేసులు నమోదు చేసి, రోజూ స్టేషన్‌కు రావాలంటూ వేధిస్తున్నారని వాపోయారు. దీనిపై తమకు న్యాయం చేయాలని ఎస్పీని వేడుకున్నట్లు బాధితులు వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి : డీఎంహెచ్‌ఓ


మాట్లాడుతున్న డాక్టర్ ఫైరోజా బేగం

మడకశిర: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజా బేగం ఆదేశించారు. సోమవారం మడకశిర అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో నియోజకవర్గంలోని పీహెచ్‌సీ డాక్టర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. చిన్న పిల్లల టీకాలు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి, తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ మాటున చీకటి దందా

- రాత్రి వేళల్లో విచ్చలవిడిగా పశుమాంసం రవాణా
- గోరంట్ల, అనంతపురం సంతల్లో పశువుల కొనుగోళ్లు
- హిందూపురంలో గుట్టు చప్పుడు కాకుండా వధ
- డ్రమ్ములు, బాక్సుల్లో నింపి టన్నుల ప్రకారం తరలింపు

సాక్షి, పుట్టపర్తి: కంటైనర్ల మాటున గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళల్లో హిందూపురం నుంచి పశు మాంసం విచ్చలవిడిగా బెంగళూరుకు తరలిపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశు మాంస అక్రమ వ్యాపారం ఊపందుకుంది. హిందూపురం నుంచి రోజూ సగటున 20 టన్నుల పశుమాంసం తరలిస్తున్నట్లు సమాచారం. పాడి, పోషణ, వ్యాపారం పేరుతో గోరంట్ల, అనంతపురంలోని పశువుల సంతల నుంచి కొనుగోలు చేసిన గేదెలు, ఆవులు, ఎద్దులు, దున్నలను పగటి పూట నేరుగా హిందూపురం తరలిస్తారు. రాత్రి వేళల్లో వధించి.. తెల్లవారు లోపు ప్యాకింగ్ చేసి కంటైనర్లలో పొరుగు రాష్ట్రానికి తరలిస్తున్నారు.



ఈ ఏడాది జూన్ 22న హిందూపురం నుంచి ఆరు వాహనాల్లో బెంగళూరుకు తరలిస్తున్న పశు మాంసాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పశువుల మాంసాన్ని ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. ఎద్దులు, ఆవుదూడలు వధించిన మాంసమా? లేక దున్నల మాంసమా అనేది తేలిన తర్వాత కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ పరిస్థితి జిల్లా నుంచి పశుమాంసం అక్రమ రవాణాకు అద్దం పడుతోంది.

అక్కడే ఎక్కువగా.. హిందూపురం పట్టణంలోని రహమత్‌పురం, ఆజాద్ నగర్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఆబాద్‌పేట, హస్నాబాద్, నింకంపల్లి తదితర ప్రాంతాల్లో పశు మాంస విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పగటి పూట కేవలం దున్నలు, ఎద్దుల మాంసం అందుబాటులో ఉంచుతారు. రాత్రి వేళల్లో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బెంగళూరుకు కిలో రూ.500 చొప్పున టన్నుల కొద్దీ తరలిస్తుంటారు. అంతేకాక పట్టణంలో సుమారు 20 షాపుల్లో పశుమాంసం విక్రయిస్తున్నారు. హిందూపురంలో 100కు పైగా వ్యాపారులు పశుమాంస విక్రయాల్లో భాగస్వాములుగా ఉన్నట్లు తెలిసింది.

నిబంధనలు బేఖాతరు మాంసం దుకాణాల్లో చాలా రోజులుగా నిల్వ ఉంచిన సరుకు ఉంటోందనే ఆరోపణలు ఉన్నాయి. పగటి పూట వధించిన పశువుల మాంసం మిగిలితే డ్రమ్ములు, ప్లాస్టిక్ సంచుల్లో నింపి రాత్రివేళల్లో కంటైనర్ల ద్వారా బెంగళూరుకు తరలిస్తున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ దందాలో టీడీపీకి చెందిన కొందరు ప్రముఖులకు ప్రతి నెలా పర్సెంటేజీల రూపంలో కమీషన్లు అందుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పశుమాంస విక్రయదారులపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సైతం వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎలుగుబంటి హల్‌చల్


ఆలయం తలుపు తీస్తున్న ఎలుగుబంటి

పావగడ: తాలూకాలోని బ్యాడనూరు గ్రామంలో ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు గ్రామంలోకి ప్రవేశించిన ఎలుగుబంటి నేరుగా ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకుని తలుపులు తోస్తుండగా కుక్కలు మొరిగాయి. దీంతో గ్రామస్తులు ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించారు. తలుపులు తీసేందుకు ప్రయత్నిస్తున్న ఎలుగుబంటిని గమనించి మంటలు వెలిగించి శబ్దాలు చేశారు. దీంతో ఎలుగుబంటి ఆలయం వద్ద నుంచి సమీపంలోని గుట్టల్లోకి వెళ్లిపోయింది.